
సాక్షి ప్రకాశం
సోమవారం | 27 | మార్చి | 2023



పది పరీక్షలకు సర్వం సిద్ధం

పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. సిబ్బందికి శిక్షణ పూర్తిచేశారు. అవసరమైన కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేస్తున్నారు. - 8లో..



ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు నిండుతున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
32 /26

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.



న్యూస్‌రీల్

మాగుంటకు సత్కారం



మాగుంటను సత్కరిస్తున్న సాహిత్య సమితి

ఒంగోలు టౌన్: శోభకృత్ నామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా తెలుగు సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా మహోత్సవాలు నిర్వహిస్తున్న శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సమితి బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబు, గౌరవాధ్యక్షుడు జి.ఓబుల్‌రెడ్డి, కోశాధికారి డా.సంత వేలూరి కోటేశ్వరరావు, కవి మొగిలి దేవ ప్రసాద్, సోమిశెట్టి శ్రీనివాస్, గంటా శేఖర్ బాబు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నాటక ప్రదర్శనల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి

ఒంగోలు టౌన్: మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ జయంతులను పురస్కరించుకొని ఏప్రిల్ నెలలో ఒంగోలు లోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించనున్న నాటకాల ప్రదర్శన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. జాతిని మేలుకొలిపేందుకు జీవితాలను త్యాగం చేసిన మహనీయుల జయంతులను పురస్కరించుకొని సామాజిక స్పృహతో కూడిన నాటకాలను నిర్వహించాలని తీసుకున్న నిర్ణయాన్ని ఆయన కొనియాడారు. నిర్వాహకులను అభినందించిన ఎంపీ ఇలాంటి ప్రజా చైతన్య కార్యక్రమాలని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాస రెడ్డి, ఘనశ్యామ్, రాపర్ల బ్రహ్మానందరెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు అంగలకుర్తి ప్రసాద్, గేరా అజయ్ బాబు, బేలూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

30న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

పెద్దారవీడు: మండలంలోని మద్దలకట్టలో గ్రామ క్రికెట్ టెన్నిస్ బాల్ పోటీలను ఈనెల 30 నుంచి ప్రారంభిస్తారని టోర్నమెంట్ సభ్యులు ఆదివారం తెలిపారు. మొదటి, రెండో, మూడో బహుమతులు వరుసగా రూ.20,116, రూ.10,116, రూ.7,116 దాతలు ప్రకటించారు. ఈ నెల 28వ తేదీలోపు ఎంట్రీ ఫీజు రూ.600 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ మ్యాచ్ ఇస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 9505243316, 8106290255 సంప్రదించాలని కోరారు.

కమ్యూనిస్టులతో పేదలకు న్యాయం

ఒంగోలు టౌన్: చట్టసభల్లోకి కమ్యూనిస్టు పార్టీలు ప్రవేశించినప్పుడే పేదలకు న్యాయం జరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య అన్నారు. మల్లయ్యలింగం భవన్‌లో ఆదివారం జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ పాలకుల రాజ్యాంగ వ్యతిరేక పోకడలకు వ్యతిరేకంగా బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 14 నుంచి మే 15 వరకు రెండు నెలలపాటు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పొత్తులతో ముందుకు సాగాలని, ఇప్పటికే తెలుగుదేశం పార్టీతో సీపీఐ, సీపీఎంలు కలిసి పనిచేస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు.

బాలికా విద్యకు భరోసా..

పేద కుటుంబాల్లోని బాలికలు.. పేదరికం కారణంగా బడి మధ్యలో మానేసిన వారు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజికవర్గాల బాలికలకు ఉచితంగా వసతి కల్పించి, నాణ్యమైన విద్యనందించి వారి భవితకు బంగారు బాటలు వేసేందుకు కస్తూరిబా గాంధీ గురుకులాలు దోహదపడుతున్నాయి. జిల్లాలో ఉన్న 37 కేజీబీవీల్లో వచ్చే విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.



పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులు

- పేద విద్యార్థినులకు వరం కేజీబీవీ
- ప్రత్యేక సౌకర్యాలతో కస్తూరిబా గాంధీ పాఠశాలలు
- ప్రవేశానికి ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20లోపు దరఖాస్తుల స్వీకరణ
- 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ప్రవేశాలు

మార్కాపురం: గ్రామీణ ప్రాంతాలకు చెందిన బడి ఈడు పిల్లలు, బడి మానేసిన బాలికలకు విద్యనందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కస్తూరిబా గాంధీ గురుకుల విద్యాలయాలను ఏర్పాటు చేశాయి. ఉమ్మడి జిల్లాలో 37 కస్తూరిబా పాఠశాలలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మార్కాపురం మండలం రాయవరం వద్ద కస్తూరిబా గాంధీ పాఠశాలను ఏర్పాటు చేశారు. అందులో ప్రతి విద్యా సంవత్సరానికి బాలికల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 6వ తరగతి ప్రవేశానికి, ఇంటర్ మొదటి సంవత్సరంతో పాటు 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఒక్కొక్క పాఠశాలలో 40 సీట్లు ఉన్నాయి. బడి మానేసిన, బడి ఈడు పిల్లలను ఉపాధ్యాయులు సర్వే నిర్వహించి గుర్తిస్తుంటారు. వారిలో బాలికలను సమీప గురుకుల విద్యాలయాల్లో చేర్పించాలని ప్రత్యేక అధికారులకు సర్వే నివేదికలు అందాయి.

పాఠశాల ప్రత్యేకతలు:

కస్తూరిబా గాంధీ గురుకుల విద్యాలయాల్లో బాలికలకు ఉచిత విద్యతో పాటు, ఉచిత వసతి అందిస్తుంటారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, దుస్తులు, పెట్టెలు ఉచితంగా అందజేస్తారు. అలాగే కాస్మోటిక్ కిట్లను ఇస్తారు. రోజు ఉదయం పాలతో పాటు టిఫిన్, సాయంత్రం చిరుతిళ్లు, గురు, శనివారాల్లో తీపి పదార్థాలు, శని, ఆదివారాలు మినహా మిగతా రోజుల్లో కోడిగుడ్డుతో తయారు చేసిన కర్రీ పెడతారు. ప్రస్తుతం 6వ తరగతిలో ప్రవేశం పొందితే 10వ తరగతితో పాటు ఇంటర్మీడియెట్ వరకు చదువుకోవచ్చు. ఒకవేళ ఇంటర్‌లో చేరితే రెండేళ్ల పాటు చదువుకోవచ్చు.



రాయివరంలో కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాల

ప్రాధాన్యత ప్రకారం ఎంపిక:

కస్తూరిబాగాంధీ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు మొదట బడిమానేసిన పిల్లలు, తల్లిదండ్రులు లేని చిన్నారులు, ఎస్సీ, ఎస్టీ వారికి ప్రాధాన్యత ఇస్తారు. పాఠశాలలో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటారు.

జిల్లాలో మార్కాపురం డివిజన్‌లోని రాయవరం, బేస్తవారిపేట, త్రిపురాంతకం, యర్రగొండపాలెం, అర్ధవీడు, గిద్దలూరు, కొమరోలు, కొనకనమిట్ల, పుల్లలచెరువు, పెద్దదోర్నాల, పెద్దారవీడు, రాచర్ల, తర్లుపాడు, పొదిలి, సీఎస్‌పురం, హెచ్‌ఎంపాడు, దర్శి, దొనకొండ, కురిచేడు, లింగసముద్రం, పామూరు, వెలిగండ్ల, వలేటివారిపాలెం, జరుగుమల్లి, పొన్నలూరు, కనిగిరి, మద్రిపూడి, ముండ్లమూరు, దర్శి, కొత్తపట్నం, తదితర ప్రాంతాల్లో కేజీబీవీలు ఉన్నాయి.

దరఖాస్తు ఇలా:

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు, అనాథలు, బడి మానేసిన బాలికలు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా పంపాలి. హెచ్‌టీటీపీఎస్://ఏపీకేజీబీవీఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్.ఇన్ వెబ్ సైట్‌లో దరఖాస్తులు పొందవచ్చు. సెలెక్ట్ అయిన విద్యార్థులకు సెల్‌ఫోన్ నంబరుకు మెసేజ్ పంపుతారు.

> **నాణ్యమైన విద్యను అందిస్తున్నాం**
>
> 
>
> కస్తూరిబాగాంధీ విద్యాలయంలో బాలికలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. మంచి భోజన వసతి ఉంది. విద్యార్థిని ఆధార్ సంబర్లు, తల్లిదండ్రుల ఆధార్ నంబర్లు తీసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. క్రీడలపై శిక్షణ ఇస్తున్నాం. వ్యర్థ వస్తువులతో వివిధ రకాల ఆకృతులు తయారు చేసే విధానంపై శిక్షణ ఇస్తున్నాం.
>
> – విజయలక్ష్మి, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి

నేడు సీఎం జగన్ జిల్లాకు రాక

- కారుమంచిలో వరికూటి అశోక్‌బాబు తల్లి భౌతికకాయానికి నివాళులర్పించనున్న సీఎం



ఒంగోలు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం జిల్లాకు రానున్నారు. వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు, వరికూటి అమృతపాణి, వరికూటి వెంకట రమణారావుల మాతృమూర్తి వరికూటి కోటమ్మ భౌతికకాయానికి నివాళులర్పించేందుకు టంగుటూరు మండలంలోని కారుమంచి గ్రామానికి రానున్నారు. ముఖ్యమంత్రి ఉదయం 10 గంటలకు తాడేపల్లి సీఎం నివాసం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 10.05 గంటలకు హెలీప్యాడ్ చేరుకుంటారు. 10.10 గంటలకు హెలికాప్టర్ ద్వారా బయలుదేరి 10.55 గంటలకు కారుమంచి జెడ్పీ హైస్కూలులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అనంతరం 11.05 గంటలకు కారుమంచిలోని వరికూటి అశోక్‌బాబు నివాసానికి చేరుకుని ఆయన తల్లి కోటమ్మ భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. అనంతరం 12.10 గంటలకు కారుమంచి హైస్కూల్ హెలీప్యాడ్ నుంచి బయలుదేరి 1.05 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు. హెలీప్యాడ్ వద్ద స్థానిక నేతలను కలిసే అవకాశం కల్పించారు.

సీఎం జగన్ పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

టంగుటూరు: సీఎం జగన్ పర్యటనకు సంబంధించి కారుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెలీప్యాడ్, అక్కడ జరుగుతున్న భద్రత ఏర్పాట్లను కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్‌లు ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం కాన్వాయికి సంబంధించి రూట్‌ని పరిశీలించారు. బారికేడ్లు, భద్రత ఏర్పాట్లను సమీక్షించి అధికారులకు పలు సూచనలిచ్చారు. అంకమ్మ గుడి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో వరికూటి అశోక్‌బాబు తల్లి కోటమ్మ భౌతికకాయాన్ని ఉంచే ప్రదేశాన్ని, అనంతరం రోడ్డు మార్గాన వరికూటి ఇంటికి వెళ్లేందుకు భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. వారి వెంట జేసీ అభిషిక్త్ కిషోర్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీలు నాగరాజు, రంగబాబు, మరియదాసు, సీఐలు, ఇతర పోలీసు అధికారులు ఉన్నారు.

హెలీప్యాడ్ పరిశీలించిన వరికూటి

కొండపి: కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు తల్లి కోటమ్మ మృతి విషయం తెలుసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదివారం ఉదయం ఆయనకు ఫోన్ చేసి పరామర్శించారు. సీఎం స్వయంగా రానుండటంతో అశోక్‌బాబుతో పాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణి కారుమంచి గ్రామంలో హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు.



కారుమంచిలో సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్



కారుమంచిలో హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న వరికూటి అశోక్‌బాబు తదితరులు

పశ్చిమాన గాలివాన



సూదనగుంటలో పిడుగుపాటుకు మృతి చెందిన జీవాలు



పామూరులో ఈదురుగాలులతో కురుస్తున్న వర్షం

- జిల్లాలో పలుచోట్ల ఈదురుగాలులతో భారీవర్షం
- పిడుగుపాటుకు 36 గొర్రెలు మృతి
- వర్షంతో ఇటుకబట్టీలకు తీవ్ర నష్టం

పామూరు/పొదిలి రూరల్: జిల్లాలో పలుచోట్ల ఆదివారం ఈదురుగాలులతో, ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. పామూరు మండల కేంద్రంతో పాటు గోపాలపురం, మోట్రావులపాడు, ఇనిమెర్ల గ్రామాల్లో వర్షం పడింది. పలుచోట్ల పచ్చి ఇటుకలపై కప్పిన పట్టలు గాలికి లేచిపోవడంతో లక్షల ఇటుకలు నీటిలో కరిగిపోయి బట్టీల నిర్వాహకులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది.

జీవాల ఉసురుతీసిన పిడుగు:

పొదిలి మండలం సూదనగుంటలో ఆదివారం సాయంత్రం పశువుల కాపరులు గొర్రెలను మేపుకొని పొలం నుంచి ఇంటికి వస్తుండగా ఒక్కసారిగా వర్షం పడటంతో కొన్ని జీవాలు పరిగెత్తుకుంటూ సమీపంలోని చెట్టు కిందకు చేరాయి. ఆ సమయంలో ఒక్కసారిగా పిడుగు పడటంతో 36 గొర్రెలు మృతిచెందాయి. పశువుల కాపరులు ఆ సమయంలో దూరంగా ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. రెడ్డెబోయిన లక్ష్మయ్యకు చెందిన 11 గొర్రెలు, మెర్రె ఆదెయ్య, రెడ్డిపోయిన చినసుబ్బయ్యకు చెందిన గొర్రెలు 3 చొప్పున, చీమల రమణయ్య, పాలకీటు చిన్నగురవయ్య, కాకర్ల శ్రీను, కాకర్ల చిననాగేష్‌కు చెందిన గొర్రెలు 4 చొప్పున, మెర్రి రామయ్య 2, కాకర్ల నాసరయ్య 1 జీవాలు మృతి చెందినట్లు తెలిపారు.

గిద్దలూరులో భారీ వర్షం

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వేసవి కాలంలో వర్షం పడటంతో ఎండ తాపం తీరి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పట్టణంలోని వీధులన్నీ వర్షపు నీటితో జలమయమయ్యాయి.

పిడుగుపాటుకు గేదె మృతి

పీసీపల్లి: పిడుగుపాటుకు పాడిగేదె మృతి చెందిన ఘటన మండలంలోని మెట్లవారిపాలెంలో చోటుచేసుకుంది. పీసీపల్లితోపాటు మండలంలోని పలుగ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ సందర్భంలో మెట్లవారిపాలెం గ్రామానికి చెందిన మన్నం నరసింహులు గేదె వారి పొలంలో మేతమేస్తుండగా పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ రూ..90 వేలు ఉంటుందని నరసింహులు తెలిపారు.

ఉప్పు రైతుల్లో ఆందోళన

కొత్తపట్నం: ఉత్పత్తి వచ్చే సమయంలో మబ్బులు కమ్ముకోవడంతో ఉప్పు రైతుల్లో ఆందోళన నెలకొంది. 20 రోజుల నుంచి ఉప్పు రాక రైతులు నిరాశ చెందుతున్నారు. ధర రెట్టింపు అయినా ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఉప్పు ఉత్పత్తి అవుతుంది. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఇంకా ఉత్పత్తి రెట్టింపుగా వస్తుంది. అంటే ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నందున ఉప్పు ఎక్కువగా వస్తుంది. అటువంటి సమయంలో మార్చి నెలలో 10వ తేదీ నుంచి ఈ రోజు వరకు మబ్బులు కమ్ముకుని అడపాదడపా వర్షం పడుతుండటంతో ఉత్పత్తి రావటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వర్షంతో కొఠారు మడులు గందరగోళం:

ఉప్పు తీయడానికి ఉప్పు మడులు రెండు నెలల పాటు చదును చేస్తారు. ఇసుక తీసుకొచ్చి మడిలో పోసి ప్రతి రోజు అంటే నెల రోజులు పాటు కాళ్లతో తొక్కి చదును చేస్తారు. ఉప్పు నీరు పెడితే ఆ మడి గట్టిగా గచ్చులాగా ఉంటుంది. అప్పుడు ఉప్పు ఉత్పత్తి పెరిగి తెలుపు నాణ్యంగా వస్తుంది. ఇప్పుడు వర్షం పడినందున మడి పాకం చెడిపోయి ఉప్పు ఉత్పత్తి తగ్గిపోతుందని, మడులు గందరగోళం అవుతాయని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కలెక్టర్ దినేష్ కుమార్ రీ సర్వేలో భాగంగా మోటుమాల ఉప్పు కొఠారు భూములను పరిశీలించారు. కూలీలు, ఉప్పు రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



అకాల వర్షానికి తడిసిన ఉప్పు

దోచుకో..పంచుకో.. ఇది బాబు విజన్

- బినామీల కోసం యువత భవిష్యత్తును నాశనం చేసిన చంద్రబాబు
- నైపుణ్యం పేరుతో రూ.కోట్లు దోపిడీ
- షెల్ కంపెనీలతో రూ.371 కోట్ల కుంభకోణానికి పాల్పడిన చంద్రబాబు
- కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: చంద్రబాబు పాలనలో నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణల పేరితో కోట్ల రూపాయల మోసానికి పాల్పడ్డారని టీటీడీ పాలక మండలి సభ్యుడు, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు అండ్‌కో అందరూ కలిసి దోచుకో.. పంచుకో.. తీసుకో అన్న తరహాలో దోపిడీకి పాల్పడ్డారని విమర్శించారు. దేశ చరిత్రలోనే అతి పెద్ద కుంభకోణానికి చంద్రబాబు పాల్పడ్డారన్నారు. రూ.371 కోట్ల కుంభకోణంలో షెల్ కంపెనీల ద్వారా నేరుగా చంద్రబాబుకు చేరినట్లు ఆరోపించారు.

బోగస్ కంపెనీల కుంభకోణంలో చంద్రబాబు ఆధారాలతో సహా దొరికిపోయారన్నారు. నైపుణ్యాల శిక్షణకు ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా నిధులన్నీ స్వాహా చేసి, యువత బతుకులను తన బినామీల కోసం బుగ్గిపాలు చేశారన్నారు. తాత్కాలిక సచివాలయ నిర్మాణ నిధుల్లో కూడా రూ.145 కోట్ల కమీషన్లకు పాల్పడ్డారని దుయ్యబట్టారు. 2014 నుంచి టీడీపీ దొంగల రాజ్యం సాగిందన్నారు. ఇదీ చంద్రబాబు అవినీతి విజన్ అని ఘాటుగా విమర్శించారు.

నియోజకవర్గంలో రూ.కోట్లతో అభివృద్ధి పరుగులు:

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని బుర్రా మధుసూదన్ యాదవ్ తెలిపారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందచేస్తున్నట్లు చెప్పారు. కనిగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. ఫ్లోరైడ్ రక్కసి నుంచి ప్రజలకు విముక్తి కలిగించి రక్షిత జలాలు అందించేందుకు కనిగిరికి రూ.530 కోట్ల పథకాలను సీఎం మంజూరు చేశారన్నారు. నియోజకవర్గంలోని 442 గ్రామాలకు సురక్షిత జలాలకు రూ.400 కోట్ల వాటర్ గ్రిడ్ పథకం మంజూరై పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. రూ.130 కోట్లతో ఏఐఐబీ కింది సమగ్ర మంచినీటి పథకం పనులు రామతీర్థం నుంచి ఇచ్చేందుకు శరవేగంగా పనులు జరుగుతున్నాయన్నారు. కనిగిరి నియోజకవర్గంలో ఓవీ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు రూ.70 కోట్లతో పనులు సుమారు 60 కి.మీల దూరం చేపట్టినట్లు తెలిపారు.

ఇప్పటికే అలవలపాడు వద్ద రోడ్డు పనులు పూర్తయ్యాయని, వేములపాడు వద్ద బ్రిడ్జి పనులు శరవేగంగా చేస్తున్నారన్నారు. 6 నెలల్లో డబుల్ రోడ్డు పూర్తవుతుందన్నారు. నేషనల్ హైవే పనులు మాలకొండ నుంచి కనిగిరి నియోజకవర్గంలోని పామూరు, సీఎస్‌పురం, డీజీపేట వయా పోరుమామిళ్ల వరకు రూ.290 కోట్లతో చేపట్టారని, ఆ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. జేజేఎం కింద గ్రామాల్లో పైప్‌లైన్ లింకు, వాటర్ ట్యాప్ పనులు రూ.110 కోట్లకు మంజూరు కాగా, ఇప్పటికే 40 శాతం పనులు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ వారు పూర్తి చేసినట్లు వెల్లడించారు. వెలిగొండ సాగర్ జలాల నీరు త్వరలో కనిగిరికి రానున్నాయని, ఈమేరకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, పార్టీ పట్టణ, మండల అధ్యక్షుడు సానికొమ్ము రంగనాయకులరెడ్డి, సంగు సుబ్బారెడ్డి, ఓకే రెడ్డి, మాజీ ఎంపీటీసీ జిలాని, రాష్ట్ర నాయకులు పిల్లి లక్ష్మీనారాయణ రెడ్డి, శ్రీహరిరెడ్డి, జానీ, కౌన్సిలర్లు వేల్పుల వెంకటేశ్వర్లు, రామనబోయిన శ్రీను, కాసుల గురవయ్య, వేల్పుల వెంకటేశ్వర్లు, పెన్నా ఏడుకొండలు, దాసరి మురళి, కంటు గురవయ్య, ఖాజామోహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో మీడియం మార్పులుంటే తెలియజేయాలి

ఒంగోలు: ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సబ్జక్టు, మీడియం మార్పు ఏదైనా ఉంటే వెంటనే సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంబంధిత విషయాన్ని డీఈవో, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామ్స్‌కుగాని తెలియజేయాలన్నారు. ఆన్‌లైన్‌లో నామినల్ రోల్స్‌లో అప్‌లోడ్ చేసిన అంగవైకల్యం ఉన్న విద్యార్థులకు డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ వారు స్క్రైబ్ ను ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చారన్నారు. సదరు విద్యార్థులు వారి పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్‌కు లేఖ ద్వారా స్క్రైబ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

స్పందన తాత్కాలిక రద్దు

ఒంగోలు టౌన్: ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కోసం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో సోమవారం తాత్కాలికం రద్దు చేసినట్లు ఎస్పీ మలికా గర్గ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

- జూనియర్ సహాయకుడు, కంప్యూటర్ ఆపరేటర్ కూడా
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

ఒంగోలు అర్బన్: నిధుల దుర్వినియోగంపై సింగరాయకొండ పంచాయతీ సెక్రటరీ శరత్ బాబు, జూనియర్ సహాయకుడు శైలజ, కంప్యూటర్ ఆపరేటర్ సురేష్‌లను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీ సాధారణ నిధులు రూ.13,91,071, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.32,77,732 కలిపి మొత్తం రూ.46,68,803 నిధులకు సరైన రికార్డులు చూపనందున నిధుల దుర్వినియోగం జరిగినట్లుగా భావించి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తర్వాత విచారణ పూర్తయ్యే వరకు వారిని సస్పెన్షన్‌లో ఉంచుతూ విచారణకు అధికారులను నియమించారు. గ్రామ పంచాయతీ పరిధిలో భవన నిర్మాణ అనుమతులపై వచ్చిన అభియోగాలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారి, తహసీల్దార్‌లు కలిపి పరిశీలించి నివేదిక అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దళితులందరూ ఏకతాటిపై ఉండాలి

- మారుమూడి మారుతీ విక్టర్ ప్రసాద్, ఎస్సీ కమిషన్ చైర్మన్


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

మేదరమెట్ల: దళితులందరూ ఏకతాటిపై ఉంటూ తమ హక్కుల పరిష్కారం కోసం పాటుపడాలని ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి మారుతీ విక్టర్ ప్రసాద్ అన్నారు. దళిత యువజన వెల్‌ఫేర్ సంఘం ఆధ్వర్యంలో కొరిశపాడు మండలంలో మేదరమెట్ల సెంటరులోని నాభిశిల సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్టా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, అంబేడ్కర్ సూచించిన మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా యువత మోటారు బైకు ర్యాలీని గ్రామంలో నిర్వహిస్తూ అతిథులను ఊరేగించారు. సోమవరప్పాడు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహ ప్రతిష్టకు చెందిన శిలాఫలకాన్ని అతిథులు ప్రారంభించారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరయ్య, ఆక్టోపస్ ఎస్పీ బల్లి రవిచంద్ర, ఎంపీపీ సాదినేని ప్రసన్నకుమారి, మేదరమెట్ల సర్పంచ్ బొనిగల ఎలిశమ్మ, మాజీ సర్పంచ్ జజ్జర ఆనందరావు, ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ ఐక్యవేదిక అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, యువజన వెల్‌ఫేర్ సంఘం సభ్యులు, పలు గ్రామాల దళిత సోదరులు పాల్గొన్నారు.


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అతిథులు

పది పరీక్షలకు సర్వం సిద్ధం..!

- సీఎస్, డిపార్టుమెంటల్ ఆఫీసర్లకు ఇప్పటికే శిక్షణ పూర్తి
- కాపీయింగ్ నిరోధంపై ప్రత్యేక దృష్టి
- ఆరుసెంటర్లలో సీసీ కెమెరాలతో నిఘా
- మరో ఆరు సెంటర్లలో సిట్టింగ్ స్క్వాడ్లు
- స్ట్రాంగ్‌రూములకు చేరిన ప్రశ్నపత్రాలు
- ఏర్పాట్లపై ప్రత్యేకంగా సమీక్షిస్తున్న జిల్లా పరిశీలకుడు ప్రసన్నకుమార్



ఒంగోలు: పది పరీక్షల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటికే కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పలుమార్లు అధికారులతో స్వయంగా సమీక్షించారు. తొలిసారి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెగ్యులర్ ఎస్ఎస్‌సీ పరీక్షలతో పాటు ఓపెన్ స్కూల్ విధానంలో జరిగే పదో తరగతి, ఇంటర్ పరీక్షలు కూడా ఏప్రిల్ 3వతేదీ నుంచే ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పరీక్షల పరిశీలకులుగా విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ప్రసన్నకుమార్‌ను జిల్లాకు కేటాయించారు. ఆయన జిల్లాకు చేరుకుని పరీక్షల నిర్వహణపై అధికారులతో చర్చించడంతో పాటు పలు సూచనలు కూడా చేసి అందుకు అనుగుణంగా చర్యలు వేగవంతం చేశారు.

3వ తేదీ నుంచి పరీక్షలు:
ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు రెగ్యులర్ పరీక్షలు ప్రారంభవుతున్నాయి. ఈ పరీక్షలకు 28902 మంది రెగ్యులర్, 350 మంది ఫెయిలైన విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. మొత్తంగా 29252 మంది విద్యార్థులు హాజరవుతున్న పరీక్షలకు 175 పరీక్షా కేంద్రాలు సిద్ధం చేశారు. వీటిని 63 జోన్లుగా విభజించి 10 రూట్లలో ప్రశ్నాపత్రాల చేరవేతకు, అదే విధంగా సమాధాన పత్రాల స్వీకరణకు ఏర్పాట్లు చేశారు. ఒక వైపు ప్రశ్నాపత్రాలను స్ట్రాంగ్ రూములకు తరలించడంతో పాటు ఖాళీ సమాధాన పత్రాలను జిల్లా పరీక్షల విభాగం నుంచి సంబంధిత సెంటర్లకు పంపించే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఈ పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించనున్నారు. పరీక్ష నిర్వహణరోజు పరీక్షా కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలుతో పాటు జెరాక్స్ సెంటర్ల మూసివేత వంటి ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆరు సెంటర్లలో పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటుచేయనున్నారు. వైడిపాడు, పిటికాయగుళ్ల, సీఎస్‌పురం, యాచవరం, రాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు కొమరోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోను సీసీ కెమేరాల నిఘాలో పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. మరో ఆరు సెంటర్లను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించి వాటిలో సిట్టింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇక చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, కస్టోడియన్లు తదితరాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయితే ఈ పరీక్షల నిర్వహణకు దాదాపు 1600 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహించనున్నారు. 19వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఓపెన్ స్కూల్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు.

ఓపెన్‌కు 6694 మంది విద్యార్థులు
ఏప్రిల్ 3వ తేదీ నుంచి 4927 మంది ఇంటర్, 1767 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. వీరికి ఏప్రిల్ 17వ తేదీ వరకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఇంటర్ పరీక్షలకు 22 కేంద్రాలు, పది పరీక్షలకు 9 కేంద్రాలు సిద్ధం చేశారు. పారదర్శకంగా పరీక్షల నిర్వహణ కోసం మొత్తం ఆరు స్క్వాడ్ బృందాలు సిద్ధమయ్యాయి. వీటిలో మూడు బృందాలు పదో తరగతి పరీక్షా కేంద్రాలపై నిఘా పెట్టనుండగా మరో మూడు బృందాలు ఇంటర్ పరీక్షా కేంద్రాలపై నిఘా పెట్టనున్నాయి.

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు


కరపత్రాలను అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి


బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

- మళ్లీ అధికారం వైఎస్సార్ సీపీదే
- ప్రతి ఇంటికి రూ.3 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఆర్థికప్రయోజనాలు
- రూ.55 లక్షలతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన
- గడప గడపలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: జగనన్న పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు విరజిమ్ముతున్నాయని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. మండలంలోని యల్లయ్య నగర్‌లో ఎమ్మెల్యే టీజేఆర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి తిరిగి ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్‌లను అందించారు. ఈ సమయంలో లబ్ధిదారుల నుంచి వస్తున్న స్పందనను చూసి బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డి హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారానే ప్రజల్లో సీఎం జగన్ కొలువై ఉన్నాడని పేర్కొన్నారు. ఏ ఇంట్లో చూసినా ఇద్దరు ముగ్గురికి తక్కువ కాకుండా సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఉన్నారని గడప గడపకు కార్యక్రమంలో రుజువైందన్నారు. ప్రతి ఇంట్లో ఇంటి స్థలం, వైఎస్సార్ ఆసరా, చేయూత, అమ్మఒడి వంటి పలు పథకాల ద్వారా పొందిన లబ్ధి సరాసరిన రూ.3 లక్షల నుంచి రూ.15 లక్షలు వరకు ప్రయోజనం పొందిన వారు ఉన్నట్లు ప్రతి సచివాలయంలోని గణాంకాలు ధృవీకరిస్తున్నాయన్నారు. సంక్షేమ పథకాలను పొందిన లబ్ధిదారులతో పాటు వైఎఎస్సార్ సీపీ నాయకులు కలిసికట్టుగా పనిచేస్తే వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమని బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డి లబ్ధిదారులనుద్దేశించి స్పష్టం చేశారు.

రూ.55 లక్షలతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన
యల్లయ్యనగర్‌లో రూ.55 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధులతో పాటు అవసరమైతే జిల్లా పరిషత్ నిధులను కూడా గ్రామాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ స్థానిక నాయకులకు భరోసా ఇచ్చారు. తొలుత గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక నాయకులు మాజీ ఎంపీపీ మేదరమెట్ల శ్రీనివాసులు, సర్పంచ్ జనరాజుపల్లి మరియమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు చిన్నపురెడ్డి సుశీల, పాపిరెడ్డి ఆధ్వర్యంలో బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, శివప్రసాదరెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. బాణసంచా, డప్పు వాయిద్యాలతో ర్యాలీగా ప్రధాన వీధుల్లో ర్యాలీగా తిరుగుతూ ఇంటింటికి తిరిగి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వల్ల కలిగిన ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. మళ్లీ సీఎం కావాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు. తొలుత స్థానిక చర్చిలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, సంజీవరెడ్డి, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, గూడూరి ఆంజనేయులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఖోఖో టోర్నీలో స్వర్ణం


బంగారు పతకాలతో భారత ఖోఖో జట్టు



శివనాగిరెడ్డిని అభినందిస్తున్న గరటయ్య


శివనాగిరెడ్డిని అభినందిస్తున్న ఎంపీ

జే.పంగులూరు: ఈ నెల 20 నుంచి 24 వరకు అసోంలోని గౌహతిలో తిమల్‌పుర స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ 4వ ఏషియన్ ఖోఖో పోటీల్లో భారత పురుషుల జట్టు బంగారు పతకం సాధించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పంగులూరు ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ క్రీడాకారుడు అట్ల శివనాగిరెడ్డి ఎంపికై పోటీల్లో పాల్గొని జట్టుకు బంగారు పతకం సాధించాడు. అసోం రాష్ట్రం నుంచి పంగులూరు వచ్చిన సందర్భంగా శివనాగిరెడ్డికి ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ ఎంఎస్ త్యాగి, మిట్టల్, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ బాచిన చెంచుగరటయ్య, మాగుంట కళాశాల చైర్మన్ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఏపీ శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చీఫ్‌ప్యాట్రన్ ఉగ్రనరసింహారెడ్డి, రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా సీతారామిరెడ్డి మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో 16 దేశాలు పాల్గొన్నాయని తెలిపారు. భారత జట్టు మంచి ఆట తీరు కనపరిచి మొదటి స్థానం సాధించిందన్నారు. ఈ జట్టులో మన రాష్ట్ర క్రీడాకారుడు అట్ల శివనాగిరెడ్డి మంచి ప్రతిభ చాటి దేశం గెలుపునకు ఎంతో దోహద పడ్డాడని తెలిపారు. పంగులూరులో మూడు దశాబ్దాలుగా ఖోఖో క్రీడకు గ్రామస్తుల సహకారం ఎంతో ఉందని గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం క్రీడాకారుడు శివనాగిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ క్రీడాకారునిగా ఎదిగినందుకు ఎంతో సంతోషంగా ఉందని, దేశానికి బంగారు పతకం తీసుకురావటంలో భాగస్వామిని అయినందుకు గర్వంగా ఉందని అన్నాడు. తనను ప్రోత్సహించిన తల్లిదండ్రులు, క్రీడలో వెంట ఉండి నడిపించిన గురువు సీతారామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపాడు.

చంద్రబాబు కుట్ర రాజకీయాలను ప్రజలు గమనించాలి

- ఎమ్మెల్సీ పోతుల సునీత


ఎమ్మెల్సీ పోతుల సునీత

చీరాల: చంద్రబాబు నాయుడు కుట్ర రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని ఎమ్మెల్సీ పోతుల సునీత పేర్కొన్నారు. చీరాలలోని ఎమ్మెల్సీ పోతుల సునీత స్వగృహంలో విలేకర్ల సమావేశంలో ఆదివారం మాట్లాడారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఏడుగురిని గెలిపించుకునే సంఖ్యా బలం ఉన్నందున ఏడుగురు నామినేషన్ వేశారని అన్నారు. అయితే చంద్రబాబు నాయుడు ఒక్క ఎమ్మెల్సీని గెలిపించుకొనే సంఖ్యా బలం లేనప్పటికీ కుట్రపూరితంగానే తన పార్టీ నుంచి అభ్యర్థిని నిలబెట్టారని విమర్శించారు. ఎమ్మెల్యేలని కోట్లు పెట్టి కొనుగోలు చేసి వారిని బలిపశువులు చేశారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే రాపాకని చంద్రబాబు తాను నిలబెట్టిన అభ్యర్థికి మద్దతుగా ఓటు వేయాలని బేరం ఆడినప్పుడే కుట్ర రాజకీయం బయట పడిందన్నారు. ఇదే తరహాలో తెలంగాణలో ఎమ్మెల్యేని కొనుగోలు చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టు బడ్డాడని గుర్తు చేశారు. ఓటుకు నోటు కేసులో దొరికిపోయి తెలంగాణ రాష్ట్రం నుంచి పారిపోయాడని అన్నారు. అదే తరహాలో 420 రాజకీయాలకు పాల్పడ్డాడని విమర్శించారు. ఆయన వ్యవహరించిన తీరును బట్టి ఆయన నీచ చరిత్ర ప్రజలకు అర్థమైందని అన్నారు. ఇటువంటి దిగజారుడు రాజకీయాలు చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని చెప్పారు. ఒక్క ఎమ్మెల్సీ స్థానాన్ని గెలిపించుకోవడానికి నలుగురు ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారని విమర్శించారు. ఒక దళిత మహిళా ఎమ్మెల్యేని బలిపశువును చేశాడని అన్నారు. రాజ్యాంగ వ్యవస్థలపై నమ్మకం లేని చరిత్ర చంద్రబాబుదన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకోవడానికి సిగ్గుగా లేదా అని ప్రశ్నించారు. ఇటువంటి నీచ రాజకీయాలకు పాల్పడడం ఆయనకు ఆనవాయితీగా మారిపోయిందని దుయ్యబట్టారు. చంద్రబాబు నాయుడు జైలుకు వెళ్లే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

102 మద్యం బాటిళ్లు స్వాధీనం

ముండ్లమూరు: మండలంలోని పూరిమెట్ల గ్రామానికి చెందిన నిధిగంటి శేషారావు అక్రమంగా తరలిస్తున్న 102 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎల్ సంపత్‌కుమార్ తెలిపారు. ఆదివారం శేషారావు తన ద్విచక్ర వాహనంపై అక్రమంగా మద్యం తరలిస్తుండడంతో దాడి చేసి పట్టుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షునిగా సుబ్బారెడ్డి


దుగ్గెంపూడి సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

ఒంగోలు అర్బన్: జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షునిగా యర్రగొండపాలెంకు చెందిన దుగ్గెంపూడి సుబ్బారెడ్డి ఎంపికయ్యారు. ఆదివారం సర్పంచ్‌ల సంఘం కార్యాలయంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అధ్యక్షతన సర్పంచ్‌ల సంఘం సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులుగా ఎంపికైన సుబ్బారెడ్డిని ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ అధ్యక్షులుగా ఎంపికయిన వాళ్లు సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలన్నారు. నియోజకవర్గాల వారీగా సర్పంచ్‌లతో సమావేశాలు నిర్వహించి సమస్యలు తెలుసుకుని పరిష్కార దిశగా కృషి చేయాలన్నారు. ఎంపికైన జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ సర్పంచ్‌ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో బొట్టు రాముయాదవ్, మునగాల వసంతమ్మ, శిరిగిరి రమేష్, వెంకయ్య, మోజమాను పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొని కారు బోల్తా

ఉలవపాడు: బైక్‌ను ఢీకొని కారు డివైడర్‌పై బోల్తా పడింది. ఈ సంఘటన మండల పరిధిలో 16వ నంబర్ జాతీయ రహదారిపై కరేడు ర్యాంపు వద్ద ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే...కేరళలోని మల్లాపురం నుంచి జగ్గయ్యపేటకు బేకరీ నిర్వాహకులు తమ సొంత కారులో వెళుతున్నారు. గుడ్లూరు నుంచి కరేడుకు గుడ్లూరుకు చెందిన తిరపతయ్య కరేడు ర్యాంపు వద్ద మలుపు తిరుగుతున్న సమయంలో కారు బైకు ముందు చక్రాన్ని ఢీకొట్టి డివైడర్‌పై బోల్తా పడింది. కారులో ఉన్న ఆలీఅక్బర్ సోహైల్, ద్విచక్రవాహనం నడుపుతున్న తిరుపతయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్ సిబ్బంది వారికి ప్రథమ చికిత్స చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కారు ఢీకొట్టిన ద్విచక్రవాహనం


ప్రమాదానికి గురైన కారు

అదుపుతప్పి బంకును ఢీకొట్టిన కారు


ఇంటి ముందుకు దూసుకెళ్లిన కారు

బేస్తవారిపేట: అదుపుతప్పి కారు బంకును ఢీకొట్టింది. ఈ సంఘటన స్థానిక పాత వెంకటేశ్వర సినిమాహాల్ సెంటర్‌లో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళితే..గిద్దలూరుకు చెందిన కారు విజయవాడకు వెళ్లి తిరుగు ప్రయాణంలో బేస్తవారిపేట సమీపంలోని పాత వెంకటేశ్వర సినిమాహాల్ సెంటర్‌లోని మూలమలుపు వద్ద అదుపుతప్పి ఇంజమ్ కాశయ్య ఇంటి ముందు ఉన్న బంకును ఢీకొట్టింది. ప్రమాదంలో బంకు ముక్కలై విరిగిపోయింది. గృహస్తులు ప్రతిరోజు బంకు పక్కనే నిద్రించేవారు. శనివారం భారీ వర్షం కురవడంతో ఇంట్లో నిద్రించారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో కారు ముందు భాగం దెబ్బతింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

వరికూటి కోటమ్మ భౌతికకాయానికి నివాళి


నివాళులర్పిస్తున్న చీరాల ఎమ్మెల్యే కరణం బలరామక్రిష్ణమూర్తి

కొండపి: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు మాతృమూర్తి వరికూటి కోటమ్మ భౌతికకాయానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. అనంతరం వరికూటి అశోక్‌బాబు కుటుంబసభ్యులను పరామర్శించారు. కోటమ్మకు నివాళుర్పించిన వారిలో చీరాల, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు కరణం బలరామకృష్ణమూర్తి, టీజేఆర్ సుధాకర్‌బాబు, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల అశోక్‌కుమార్, ఆర్టీసీ నెల్లూరు రీజియన్ చైర్మన్ బత్తుల సుప్రజారెడ్డి ఉన్నారు. వీరితో పాటు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ యాదాల అశోక్‌కుమార్, నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు నివాళులర్పించారు.


నివాళులర్పిస్తున్న ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు